
సాక్షి ములుగు

ఆదివారం । 14 । జూలై । 2024



విద్యార్థులకు 'విజ్ఞాన్ మంథన్'

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను జాతీయ స్థాయిలో వెలికి తీసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో 'విజ్ఞాన్ మంథన్' నిర్వహించనుంది.

- 8లో



ఆపరేషన్ వికటించి..

ఆపరేషన్ వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది.

- 8లో

గరిష్టం/కనిష్టం
28.0° /24.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల సమస్యలపై సీఎం స్పందించాలి



ములుగు రూరల్: అంగన్‌వాడీల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు శనివారం ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను విధుల నుంచి తొలగించి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్కువగా అందించడం సరికాదన్నారు. నూతన జీఓ విడుదల అయ్యేంత వరకు అంగన్‌వాడీలను విధుల్లోకి తీసుకోవాలన్నా రు. నూతన జీఓ ప్రకారం అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు లక్ష అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సమ్మక్క, పద్మ, భాగ్యలక్ష్మీ, మోక్షరాణి, అరుంధతి, ధనలక్ష్మీ, విజయ, రుక్మిణి, సునీత, రమాదేవి, శాంత పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మంగపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున సూచించారు. చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాల ంలో వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రతిరోజూ విద్యార్థులకు కాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగించాలని, విద్యార్థులు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా, జ్వరం వచ్చినా వెంటనే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఇప్పించాలని వార్డెన్ రూపకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాంబాయి, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

ఉగ్రా, శివదూతి క్రమాల్లో అమ్మవారు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం అమ్మవారికి ఉగ్రా, శివదూతి క్రమంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం సుప్రభాతసేవ నిత్యాహ్నికం క్షీరాన్న నివేదన నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం తిథి మండల దేవతాయజనంలో భాగంగా.. అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన ఉగ్రమాతగా, అమ్మవారి భోగబేరాన్ని షోడశీ క్రమంలో శివదూతి అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషు భారతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

కాటారం: మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్‌కు ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై మ్యాక అభినవ్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండల కేంద్రంలో శనివారం రాత్రి ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్లు నడుపుతున్న నాలుగు వాహనాలను గుర్తించి సీజ్ చేసి మోటర్ వెహికిల్ యాక్టు ప్రకారం వారి పేరెంట్స్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్‌కు పాల్పడిన ఎనిమిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యంగా..

ఐటీఐలు ఏటీసీలుగా మార్పు

- త్వరలోనే కొత్త కోర్సులు ప్రారంభం
- టీటీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం
- ఏటూరునాగారంలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు
- మొదలైన భవన నిర్మాణ పునాది పనులు



ఏటూరునాగారం ఐటీఐ

ఏటూరునాగారం: అరకొర వసతులతో కునారిల్లుతున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలు(ఐటీఐ) త్వరలో కొత్తరూపును సంతరించుకోబోతున్నాయి. కాలం చెల్లిన సంప్రదాయ కోర్సులతో ఇప్పటికీ నెట్టుకొస్తున్న ఈ ఐటీఐలలో ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా అధునాతన సాంకేతిక కోర్సులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దీంతో ఐటీఐలంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చిన్నచూపు చూసే పరిస్థితి మారనుంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్ (ఏటీసీ)గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనుంది. రాష్ట్రంలో 64 ఐటీఐలను ఎంపిక చేయగా మొదటి దశలో ఉమ్మడి వరంగల్‌లోని మూడు ఐటీఐలు ఏటీసీలుగా మారనున్నాయి.

వరంగల్, ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలురు)లు ఉన్నాయి. అందులో జిల్లాలోని ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని నూతనంగా ఏటీసీ భవనాన్ని నిర్మించేందుకు పునాది పనులు మొదలయ్యాయి. ఒక్కొక్క దానిపై రూ.50కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. రూ.4.50 కోట్లు భవన నిర్మాణం, మిగతా బడ్జెట్ సామగ్రికి కేటాయించనున్నారు. టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో వీటిని అప్ గ్రేడ్ చేస్తారు. ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్షన్ ప్రాజెక్టులో భాగంగా ఐటీఐలలో ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇందులో అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. అయితే ఏటూరునాగారంలో అన్ని రకాల ట్రేడ్స్ ఉన్నప్పటికీ హాస్టల్ సౌకర్యం లేక దూర ప్రాంతాల్లోని విద్యార్థులు ఇక్కడ ఉంటూ చదువుకోలేకపోతున్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తే మరింత పెరిగే అవకాశం ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇప్పుడు ఏటీసీ సెంటర్‌గా మార్పుచేసి హాస్టల్ సౌకర్యం కల్పిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేసినట్లు అవుతుంది.

ఆరు అధునాతన ట్రేడ్స్

జిల్లాలోని ఏటూరునాగారంలో ముఖ్యంగా తమ కంపెనీకి సరిపడే వృత్తినిపుణులను తయారు చేయడానికి ఆరు ఆధునాతన ట్రేడ్లను ఏటీసీలో ప్రవేశ పెట్టనున్నారు. ఇండస్ట్రీయల్ రోబోటిక్స్, అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, ఆర్టిషియన్ యూజింగ్ ఆడ్వాన్సుడ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్) వీటిలో ఉన్నాయి. ఇండస్ట్రియల్ రొబోటిక్స్ అండ్ డిజిటల్ ప్రాసెస్ నడుస్తున్నాయి. ఐటీఐల పట్ల విద్యార్థులు అంతగా ఆసక్తి చూపకపోవడంతో ప్రైవేట్ ఐటీఐల సంఖ్య క్రమంగా తగ్గింది. ఎలక్ట్రీషీయన్, ఫిట్టర్, ప్లంబర్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, టర్నర్, డ్రాఫ్ట్ సివిల్, కంప్యూటర్ ఆపరేటర్ తదితర కోర్సులు వీటిలో ఉన్నాయి. ఇవన్నీ పాతకాలపు ట్రేడులు. అధునాతన సాంకేతికత పరిజ్ఞానం పెరుగుతూ వస్తోంది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సరికొత్త కోర్సులను అభ్యసించినప్పుడే భవిష్యత్తు ఉంటుంది. టాటా వంటి కంపెనీలకు అవసరమైన సిబ్బంది దొరకకపోవడానికి కారణం పాత ట్రేడ్లనే విద్యార్థులు నేర్చుకోవడం. ఈ కొరతను తీర్చడానికి టీటీఎల్ విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ఉపాధి, అవకాశాలు పొందగలిగేలా వారిలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టులో భాగస్వామి అవుతుంది. ఇందులో భాగంగా టీటీఎల్ ప్రస్తుత పారిశ్రామిక అవసరాల కోసం 240 మందికి సరిపడా వసతి, శిక్షణ ఇచ్చేందుకు భవన నిర్మాణ పనులను కూడా మొదలు పెట్టింది.



ఏటీసీ కోసం చేపట్టిన పునాది పనులు

ఏటీసీ పనులు ప్రారంభం



టాటా టెక్నాలజీ వారి సహకారంతో ఏటీసీ పనులు మొదలయ్యాయి. ఐటీఐకి ఉన్న రూల్స్ దీనికి కూడా వర్తిస్తాయి. టీచింగ్ సిబ్బంది సైతం టాటా వారు సమకూర్చుతారు. ఐటీఐ, ఏటీసీలో చేరిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఒక్కో ట్రేడ్‌కు రెండు యూనిట్ల చొప్పున 240 సీట్లు కేటాయించనున్నారు.

- పి.వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్, ఐటీఐ ఏటూరునాగారం

బొగతకు పోటెత్తిన పర్యాటకులు

మండల పరిధిలోని చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతానికి శనివారం పర్యాటకులు పోటెత్తారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో బొగతను చూసేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. బొగతను వీక్షించడంతో పాటు ఫొటోలు దిగారు. స్నానాల కొలనులో ఈతకొడుతు కేరింతలు కొట్టారు.

- వాజేడు



సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క
- పలు మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి సీతక్క



చల్వాయిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర

ఎస్ఎస్‌తాడ్వాయి/గోవిందరావుపేట/ఏటూరునాగారం/కన్నాయిగూడెం: గిరిజన ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, త్వరలోనే పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మారుమూల ప్రాంతమైన లింగాలలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొత్తగా పోడు కొట్టడం మానేసి ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించడంతో పాటు వికలాంగులకు సదరం క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు మీసేవ కేంద్రాల ఏర్పాటు, మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై అవగాహన కల్పించి వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. మహిళలు ముందుకు రావాలని కోరారు. ప్రజాదర్బార్‌కు లింగాల, బందాల, కొడిశాల, లవ్వాల గ్రామాల ప్రజలు హాజరై పలు సమస్యలపై మంత్రి సీతక్కకు దరఖాస్తులను అందజేశారు. అనంతరం పోచాపూర్‌లో కంటైనర్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. సుమారు రూ.7లక్షల వ్యయంతో దీన్ని రూపొందించినట్లు తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలో రూ.2కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనంతో పాటు గదుల భవనం, ప్రయోగశాలల భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్, రవీందర్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు, వసతి భవనం ప్రారంభం

గోవిందరావుపేట మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో సమగ్ర శిక్ష నిధులు రూ.1.35కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ తరగతి గదులు, వసతి భవనాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు కల్పించామని తెలిపారు. పదో తరగతి నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జీసీడీవో రమాదేవి, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎస్ఓ వెంకటలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణులకు పల్లెవైద్యం సులభం

ఏటూరునాగారం మండల పరిధిలోని చల్పాక గ్రామంలో రూ.16 లక్షల ఎన్‌హెచ్ ఎం నిధులతో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను మంత్రి సీతక్క కలెక్టర్ దివాకరతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎంహెచ్ఓ అప్పయ్య, పాల్గొన్నారు. కన్నాయిగూడెం మండల పరిధిలోని ముప్పనపల్లి హైస్కూల్ ప్రాంగణంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ భవనాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. రూ.3.50కోట్ల ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు పూర్తి కావడంతో శనివారం మంత్రి ప్రారంభించారు.

నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరు



వాజేడు: మాట్లాడుతున్న సాంబశివ

వాజేడు: నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ అన్నారు. మండల పరిధిలోని గుడిసెవాసుల కేంద్రం వద్ద శనివారం సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. మండలకేంద్రంలో పోరాటం ప్రారంభించి 10 నెలలు పూర్తి అయిందని ఇప్పుడు పార్కుల పేరుతో వచ్చి గుడిసెలను కూల్చాలని చూడడం సరికాదన్నారు. ఇన్ని రోజులుగా లేని పార్క్ స్థలం ఇప్పుడు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పేదల పోరాటాన్ని చూసి ఓర్వలేక స్వార్థపరులు గుడిసెలను కూల్చాలని అధికారులపై ఒత్తిడి తెచ్చి వారిని వెంటబెట్టుకుని వచ్చి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళలు అడ్డుకోవడంతో అధికారులు వెళ్లి పోయారని తెలిపారు. ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తున్న వారిపై కనికరం చూపకుండా ఖాళీ చేసి వెళ్లాలని లేదంటే కేసులు పెడతామని బెదిరించడం మంచిది కాదన్నారు. ఉంటే భూమి మీదం ఉంటాం లేక పోతే జైల్లో ఉంటాం కాని ఎవరికి భయపడేది లేదన్నారు. ఈ సమావేశంలో రఘుపతి, ముత్తయ్య, దేవయ్య, కృష్ణ బాబు, శాంత కుమారి, సౌమ్య, కుమారి పాల్గొన్నారు.

అందం.. ఆరోగ్యం!

ఆషాఢ మాసంలో గోరింటాకు స్పెషల్

సండే స్పెషల్

ఆషాఢమాసం.. వచ్చిందంటే ప్రతి ఇంటా గోరింటాకు పండాల్సిందే. ఆడవారు రెండు చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబరపడతారు. ఇక.. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు ఈ మాసంలో పుట్టింటికి చేరుకోవడం ఆనవాయితీ. చేతులకు గోరింటాకు పెట్టుకుని, ఆ ఆకు ఇచ్చే రంగును చూసుకుని సంబరపడిపోతారు. ఎర్రగా పండిన రంగును తన సౌభాగ్యాన్ని గుర్తుచేస్తూ పుట్టింట ఉన్న మనసు మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. పెళ్లికాని యువతులకు గోరింటాకు ఎర్రగా పండితే మంచి వరుడు వస్తాడని, పెళ్లయిన మహిళలు తమ కుటుంబ సుఖ సంతోషాలతో కలకాలం కొనసాగాలని కాంక్షిస్తుంటారు. **- కాజీపేట అర్బన్**





హనుమకొండలోని జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో గోరింటాకు వేడుకల్లో మహిళలు

- అనాదిగా వస్తున్న సంప్రదాయం
- కోన్ వద్దు.. సహజ సిద్ధ గోరింటాకు ముద్దు
- ప్రతీ ఇంటా ఒకరోజు స్పెషల్ వేడుక
- ఎర్రగా పండిన చేతులను చూసి మురిపెం
- వర్షాకాలంలో వ్యాధులనుంచి రక్షణ





రాబోవు తరాలకు సంస్కృతిని అందిస్తూ...

ఆషాఢమాసంలో గోరింటాకుతో మహిళలు శనివారం హ్యాండ్‌ఫుల్..కలర్‌ఫుల్‌గా సందడి చేశారు. ఆభరణాలు, వస్త్రాలతోనే కాదు ప్రకృతిలో లభించే గోరింటాకును ఆభరణంగా చేర్చుకుని తమ చేతులు, కాళ్లను అందంగా తీర్చిదిద్దుకునేందుకు ఆసక్తి కనబరిచారు .హనుమకొండ వడ్డేపల్లిలోని జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న కుటుంబాలు ఉమ్మడి కుటుంబాన్ని తలపిస్తూ ఆషాఢమాసంలో గోరింటాకు పండుగను జరుపుకున్నారు. రాబోయే తరాలకు కోన్స్ వద్దు.. సహజ సిద్ధమైన గోరింటాకు ముద్దు అంటూ వారసత్వ సంపదగా బామ్మలు, మహిళలు చిన్నారులకు గోరింటాకు అందజేశారు.



గౌరీదేవిగా గోరింటాకు..

పురాణాలు, భారతీయ సంస్కృతీసంప్రదాయాల్లో గోరింటాకును గౌరీదేవిగా కొలుస్తారు. ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకునే ముందుగా గౌరిదేవికి మహిళలు నిష్ఠగా పూజలు చేస్తారు. గోరింటాకును తమ చేతులు,కాళ్లకు పెట్టుకుని ఎర్రగా పండాలని మొక్కుకుంటారు. ఫ్యాషన్‌గానే కాదు దైవభక్తిని పెంపొందించడంలో గోరింటాకు ప్రత్యేక భూమిక పోషిస్తుంది.

శాస్త్రీయ కారణాలు..

గోరింటాకు ప్రయోజనాలు శాస్త్రీయంగా నిరూపితమయ్యాయి. అరచేతి మధ్యలో స్త్రీ గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాననాడులుంటాయి. వాటిలోని అధిక వేడిని ఆ ఆకు లాగేస్తుంది ప్రసవం కాగానే గోరింటాకు ముద్దగా నూరి బాలింతతో మింగిస్తే ప్రసవం వలన ఏర్పడే గర్భాశయ బాధలు నయమవుతాయి. గోరింటాకు పండటం అనేది ఆమగువ ఆరోగ్యం, అందం సూచిస్తుంది. అందుకే అందంగా ఉన్న అమ్మాయికి చక్కని భర్త వస్తాడని అంటుంటారు.

ఆషాఢమాసంలో తప్పకుండా..



ఆషాఢ మాసంలో తప్పకుండా గోరింటాకును చేతులు, కాళ్లకు పెట్టుకుంటాం. ఆ ఆకును గౌరిదేవి ప్రసాదంగా గౌరిదేవి సాక్షాత్కారం అందజేయాలని, ఆశీర్వదించాలని పూజ చేసి పెట్టుకుంటాం. మా జీఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో పండుగ వాతావరణంలో గోరింటాకు మహోత్సవాన్ని జరుపుకుంటాం.

- కరుణశ్రీ

అందంతో పాటు ఆరోగ్యం



గోరింటాకు మహిళలకు అందంతోపాటు ఆరోగ్యాన్ని అందజేస్తుంది. ఆషాఢమాసంలో ఎక్కువగా వర్షాలు కురవడంతో వైరస్‌లు ప్రబలే ప్రమాదం ఉంది, వాటినుంచి యాంటీబయాటిక్‌లాగా ఉపయోగపడుతుంది. ప్రతీ మహిళ తప్పకుండా ఈ మాసంలో వచ్చే అనారోగ్యాల బారినుంచి తప్పించుకునేందుకు గోరింటాకు పెట్టుకోవాలి. **- జొన్నల నాగకుమారి**

గర్భాశయ వ్యాధులు దూరం



ప్రకృతి ఒడిలో లభించే సహజ సిద్ధమైన గోరింటాకును మహిళలు చేతులకు పెట్టుకోగా ఎర్రగా పండుతుంది, అరచేతిలోని గర్భాశయ నరాలకు గోరింటాకు మంచి ఔషధంగా పనిచేసి గర్భాశయ సంబంధిత వ్యాధులను దూరం చేస్తుంది. ఆషాఢమాసంలో ఎక్కువగా లభించే గోరింటాకును పెట్టుకుని ఆరోగ్యంగా ఉండొచ్చు.

- ఉమాదేవి

సంతోషానికి గోరింటాకు



పెళ్లికాని యువతులు గోరింటాకు ఎర్రగా పండితే మంచి వరుడు వస్తాడని భావిస్తారు, అదే విధంగా పెళ్లయిన మహిళలు తమ భర్త, కుటుంబం సంతోషంగా ఎళ్లకాలం ఉండేందుకు గోరింటాకు ఎర్రగా పండాలని ఆశపడుతుంటారు. గోరింటాకులోని ఔషధ గుణాలు ఒంట్లోని వేడిని తగ్గించడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయి. **- అనిత**

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డాక్టర్ రామకృష్ణ



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ రామకృష్ణ. చిత్రంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని ధన్యవాదాలు తెలిపారు.

ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో అరుణ్ ప్రతిభ



దగ్ధమవుతూ పొగతో నిండిన అడవి


భూపాలపల్లి అర్బన్: వాతావరణ మార్పుల గుర్తింపుపై ఎర్త్.ఓఆర్జీ సంస్థ నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ నలిమెల అరుణ్‌కుమార్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది వేసవిలో భూపాలపల్లి మండలం కమలాపూర్‌లోని అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతున్న సమయంలో ఆ దృశ్యాన్ని అరుణ్‌కుమార్ తన డ్రోన్ కెమెరాలో బంధించారు. మంటలు వ్యాపిస్తూ 'పొగ' మంచు వలే అడవిని కమ్మేస్తూ కనిపించింది. దీంతో పాటు సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో గణపురం మండలం చెల్పూర్ కేటీపీపీలోని రెండు పొగ గొట్టాల మధ్య నుంచి సూర్యుడిని ఫొటో తీశారు. ఆ సమయంలో ఆకాశం ఎరుపెక్కింది. ఈ రెండు ఫొటోలు ఫైనల్‌కు చేరుకోగా మూడు రోజుల క్రితం విడుదల చేసి ఫలితాల్లో రన్నరప్‌గా నిలిచాయి.

పోలీసుల అదుపులో నిషేధిత గుట్కా కంటైనర్

ఏటూరునాగారం: నిషేధిత గుట్కా కంటైనర్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్ గుట్కా లోడ్‌తో ఢిల్లీ నుంచి ఏటూరునాగారం మీదుగా 163 జాతీయ రహదారిపై వెళ్తుండగా అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో 175 బస్తాల అంబర్ ప్యాకెట్లు, 35 బస్తాల పాన్ మసాలా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కాగా, తెలంగాణలో గుట్కాపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే ఇతర రాష్ట్రాల్లో నిషేధం లేకపోవడంతో తెలంగాణ నుంచి వాహనం వెళ్లేందుకు అనుమతి ఉందా లేదా అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ విషయాన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కానీ కంటైనర్ మాత్రం ఇంకా పోలీసులు అదుపులోనే ఉన్నట్లు సమాచారం.

విద్యార్థులకు 'విజ్ఞాన్ మంథన్'

ఆరు నుంచి ఇంటర్ ఫస్టియర్ చదివే విద్యార్థులకు పరీక్షలు రాసే అవకాశం | ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు గడువు సెప్టెంబర్ 15



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లోగో



ఆన్‌లైన్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కాజీపేట సెంటర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను జాతీయస్థాయిలో వెలికి తీసేందుకు విద్యాశాఖ బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసింది. దేశ వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విజ్ఞాన్ మంథన్ పరీక్ష రాసేందుకు సువర్ణావకాశం కల్పిస్తోంది.

పరీక్ష విధానం ..

దేశ వ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ బోర్డు అనుమతి పొందిన పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు విజ్ఞాన్ మంథన్ పరీక్ష రాయడానికి అర్హులు. ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీతోపాటు 9 ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. పాఠశాలస్థాయిలో పరీక్ష నిర్వహించి ప్రతి తరగతిలో 10 మందిని ఎంపిక చేస్తారు. వీరిలో ముగ్గురు టాపర్లను విజేతలుగా ప్రకటించి జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షకు హాజరవుతారు.

సిలబస్ ఇలా..

సామాన్య శాస్త్రం, గణిత శాస్త్ర పాఠ్యాంశాల నుంచి 50 ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు ఇస్తారు. భారత రాజ్యాంగం, సాంకేతికరంగంలో భారతదేశ పాత్ర, సేవలు అంశానికి సంబంధించి 20 ప్రశ్నలు, ఇద్దరు శాస్త్రవేత్తల జీవిత చరిత్రపై 20 ప్రశ్నలు ఉంటాయి. సహేతుక అన్వేషణ, తర్కం (లాజికల్ రీజనింగ్), సాధారణ విజ్ఞానానికి సంబంధించి 10 ప్రశ్నల చొప్పున మొత్తం 100 ప్రశ్నలకు విద్యార్థులు ప్రతిస్థాయిలో సమాధానాలు రాయాలి. ఒక్కోస్థాయికి వెళ్లినకొద్దీ ప్రశ్నలు కఠినంగా ఉంటాయి. పరీక్ష రాసేందుకు రెండు గంటల సమయం ఉంటుంది.

దరఖాస్తు చేయడం ఇలా..

పరీక్షకు హాజరయ్యే విద్యార్థి రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నగదు, డీడీలు, చెక్కులు చెల్లవు. www.vvm.org.inలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి సొంతంగా పేరు నమోదు చేసుకునే అవకాశం లేదు. చదువుతున్న పాఠశాలల నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రం ఎక్కడ అనేది నిర్వాహకులు తెలియజేస్తారు. ఇంటర్నెట్, కంప్యూటర్లు, కనీసం 50 మంది విద్యార్థులు ఉంటే ఆ పాఠశాలలో పరీక్ష రాయడానికి సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ఈనెల 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ..

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024–25 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సెప్టెంబర్ 15వ తేదీ వరకు పాఠశాలల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణ జూలై 1 నుంచే ప్రారంభమైంది. పరీక్ష అక్టోబర్ 23న లేదా 27న ఏదో ఒక రోజు ఉండే అవకాశం ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంట సమయంలో 90 నిమిషాలు మాత్రమే పరీక్ష ఉంటుంది.

విజేతలకు బహుమతులు

నాలుగు దశల్లో రాసిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు ప్రదానం చేస్తారు. మొదట పాఠశాలస్థాయిలో ముగ్గురికి ధ్రువపత్రాలు అందిస్తారు. జిల్లాస్థాయిలో సబ్జెక్టుల వారీగా ముగ్గురు ప్రతిభావంతులకు ధ్రువపత్రాలు అందజేయడంతోపాటు రాష్ట్రస్థాయిలో ఏదైన పరిశోధన కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన మొదటి ముగ్గురికి ధ్రువపత్రాలు, జ్ఞాపికలతోపాటు వరుసగా మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2 వేల చొప్పున నగదు అందజేసి దేశంలోని పరిశోధన కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. అంతేకాకుండా భాస్కర స్కాలర్‌షిప్ పేరుతో ఏడాదిపాటు నెలకు రూ.2వేల చొప్పున అందజేస్తారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన ముగ్గురికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికతోపాటు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10వేల నగదు బహుమతులను రాష్ట్రపతి అందజేస్తారు. అదేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024–25 పరీక్ష విద్యార్థులు ప్రతిభ కనబర్చడానికి ఎంతో ఉపయోగకరం. ఈ పరీక్ష రాయడానికి ఆయా పాఠశాలల సైన్స్ టీచర్లు విద్యార్థులను ప్రోత్సహించాలి. వారి సృజనాత్మకతను వెలికితీయాల్సిన అవసరం ఉంది. అర్హతగల పాఠశాలలకు విజ్ఞాన్ మంథన్‌తో సువర్ణ అవకాశం లభిస్తుంది. దీనిపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలి.

- డాక్టర్ కట్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థులకు సువర్ణావకాశం



పుస్తక పఠనమే కాకుండా విద్యార్థులను ప్రయోగాల వైపు మళ్లించాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టే బృహత్తరమైన ప్రోగ్రాం విజ్ఞాన్ మంథన్. ఇది వారికి సువర్ణావకాశం. ఈ విద్యాసంవత్సరం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ నిర్వహించనున్నారు. అన్ని పాఠశాలల సైన్స్ టీచర్లు విద్యార్థులను సిద్ధం చేయాలి. ఉత్తమ ప్రతిభ కనబరిచే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించాం.

- డి.వాసంతి, వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి

ముగ్గురి ప్రాణం తీసిన పాడిగేదె కళేబరం



సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులు (ఫైల్)



నాగరాజు(ఫైల్)



నుజ్జునుజ్జయిన ఆటో





గాయపడిన అంజిరెడ్డి, అనిత

కళేబరాన్ని తప్పించబోయిన ఆటో.. ఎదురుగా ఢీకొన్న కంటైనర్

- ఆటోలోని ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో భార్యాభర్తలు, ఆటోడ్రైవర్
- కూతురును సాగనంపేందుకు వెళ్తుండగా ప్రమాదం

ఏటూరునాగారం: పాడిగేదె కళేబరం ముగ్గురి ప్రాణాలు తీసింది. ఆటోలో తన కూతురును అత్తగారింటికి వెళ్లే బస్సు ఎక్కించేందుకు వస్తున్న తల్లిదండ్రులను, ఆటోడ్రైవర్‌ను పరకాలోకాలకు చేర్చింది. ఈ ఘటనలో కూతురుతోపాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వాజేడు గ్రామానికి చెందిన భార్యాభర్తలు కాకర్లపుడి సత్యనారాయణరాజు అలియాస్ ఎర్రబాబు (75), సత్యవతి (65)లు తమ కుమార్తె అనితను తన అత్తగారి ఊరైన ఆంధ్రప్రదేశ్‌లోని తుని (వైజాగ్) బస్సు ఎక్కించేందుకు స్థానిక తలండి నాగరాజు (20) ఆటోను మాట్లాడుకుని బయలుదేరారు. ఆటోలో నాగరాజుకు తోడుగా పెనుమళ్ల అంజిరెడ్డి అనే వ్యక్తి కూడా వస్తున్నాడు. ఐదుగురు కలిసి వస్తుండగా ఏటూరునాగారం మండలకేంద్రంలోని 163 జాతీయ రహదారి హైవే ట్రీట్ వద్ద అడ్డంగా పడి ఉన్న పాడిగేదె కళేబరాన్ని (నాలుగు రోజుల క్రితం మృతిచెందింది) ఆటోడ్రైవర్ తప్పించబోయాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ వాహనం ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయ్యింది. కాకర్లపుడి సత్యనారాయణరాజు, సత్యవతి , ఆటోడ్రైవర్ నాగరాజు అక్కడికక్కడే చనిపోయారు. అనితతోపాటు అంజిరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో 108లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేయించి అనంతరం వరంగల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై తాజొద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురు మృతదేహాలను ట్రాక్టర్ ద్వారా తరలించారు. ఢీకొట్టిన కంటైనర్‌తో డ్రైవర్ పారిపోతుండగా జగన్నాథపురం వద్ద గ్రామస్తులు అడ్డుకొని నిలిపివేశారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

కళ్లెదుటే ప్రాణం పోయింది..

- లారీ ఢీకొనడంతో హోంగార్డు దుర్మరణం
- ఛిద్రమైన శరీరం
- మామునూరులో ఘటన
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సుధాకర్ (ఫైల్)

మామునూరు: ఆ హోంగార్డు మరో పది నిమిషాల్లో విధుల్లో చేరేవాడు. అంతలోపే మృత్యువు మాటు వేసి కాటేసింది. లారీ రూపంలో వచ్చి కబలించింది. లారీ.. అతడిపై నుంచి వెళ్లడంతో శరీరం ఛిద్రమైంది. చూస్తుండగానే ప్రాణంపోయింది. ఈ విషాదకర ఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం మామునూరుకు చెందిన వడ్డెపెల్లి సుధాకర్ (55) టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగానే శనివారం ఉదయం 5.45 గంటలకే ఇంటి నుంచి టీఎస్ఎస్పీ బెటాలియన్ బయలుదేరాడు. వరంగల్–ఖమ్మం జాతీయ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా 6గంటల సమయాన ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న లారీ అదుపు తప్పి ఢీకొంది. దీంతో వెనుక చక్రాలు అతడిపై నుంచి వెళ్లడంతో శరీరం మొత్తం ఛిద్రమైంది. రోడ్డుపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచింది. వెంటనే స్థానికులు మామునూరు పోలీసులకు సమాచారం అందజేయగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్.. ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్‌తో కలిసి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. వివరాలు సేకరించి రోడ్డుపై పడి ఉన్న మాంసపు ముద్దలను ప్లాస్టిక్ కవర్‌లో మూటకట్టి ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య కోమల, కుమారుడు, కుమార్తె ఉంది. పరారీలో ఉన్న లారీని గుర్తించేందుకు హైవేపై ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించారు. మరో పదినిమిషాల్లో డ్యూటీకి వస్తానని చెప్పిన హోంగార్డు సుధాకర్ దుర్మరణం చెందాడని తెలిసి సహసిబ్బంది, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో మామునూరులో విషాదం నెలకొంది. ఈ ఘటనపై హోంగార్డు భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపారు.

పరామర్శించిన కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి..

టీఎస్ఎస్పీ బెటాలియన్ హోంగార్డు సుధాకర్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలిసి కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు హుటాహుటిన ఎంజీఎం మార్చురీ వద్దకు చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం కల్పించారు. మృతుడి కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులపై మూకుమ్మడి దాడి

- వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో ఘటన
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘాల డిమాండ్

వరంగల్: వరంగల్‌లోని లక్ష్మీపురం మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులపై అదే మార్కెట్‌లోని ఓ కమీషన్ షాపు యాజమాని వద్ద పనిచేస్తున్న గుమస్తా, అతడి స్నేహితులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో రైతులకు గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన రైతు సయింపు వెంకటేశ్వర్లు, వంజరపల్లికి చెందిన మరో రైతు సిరుల రవీందర్ తమ కూరగాయలను లక్ష్మీపురం మార్కెట్‌లోని రైతు బజార్ వద్ద విక్రయించారు. కొన్ని కూరగాయల బస్తాలు మిగలడంతో అక్కడే పెట్టారు. అదే దారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న 98 నంబర్ షాపులో పనిచేస్తున్న గుమస్తా సునీల్, అతడి స్నేహితులు రంజిత్, వినోద్.. బస్తాలను ఢీకొట్టారు. ఎవడ్రా బస్తాలు పెట్టిందంటూ దుర్భాషలాడారు. దీంతో రైతులు ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించగా ముగ్గురు.. సదరు రైతులపై దాడి చేసి చితకబాదినట్లు వ్యాపారులు తెలిపారు. ఈ విషయం తెలిసిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మార్కెట్ వద్దకు వచ్చి దాడి చేసిన వారిపై ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులపై దాడి చేసిన వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసి మళ్లీ ఏ రైతుపై దాడి చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య, బాధ్యులు సిరుల రవీందర్, సయింపు వెంకటేశ్వరరావు, రాంబాబు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఘటనా స్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగి వచ్చి దాడి చేశారు



ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి స్కూటీ మీద రైతులు కూరగాయల అమ్ముకునే స్థలంలోకి వచ్చారు. ఇష్టం వచ్చినట్లు రైతులను తిట్టుకుంటూ కొట్టుకుంటూ హంగామా సృష్టించారు. ఎందుకు తిడుతున్నారని అడిగిన వారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. ఘటన జరిగిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేశా. ఇప్పటి వరకు పోలీసులు వారిని పట్టుకోలేదు. వారిపై ఫిర్యాదు చేసినా చర్య తీసుకోలేదు.

-వెంకటేశ్వర్లు, బాధితుడు

ఆపరేషన్ వికటించి బాలుడి మృతి

- బంధువులు, కుటుంబ సభ్యుల ఆరోపణ
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన



ఆసుపత్రి ఎదుట విలపిస్తున్న బాలుడి బంధువులు

నెహ్రూసెంటర్ : ఆపరేషన్ వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాలుడి బంధువులు ఆరోపించారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని చోటు చేసుకుంది. వారి కథనం ప్రకారం.. డోర్నకల్ మండలం బూరుగుపాడుకు చెందిన కొత్త రాంబాబు, ప్రియ దంపతుల రెండో కుమారుడు తనూష్ (13)కు వరిబీజం ఆపరేషన్ చేయించేందుకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 'సురక్ష' ఆసుపత్రికి తీసుకొచ్చారు. అదే రోజు ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని ఆపరేషన్ చేయగా బాలుడు తీవ్ర అస్వస్థతకు గురికాగా వెంటనే జిల్లా కేంద్రంలోని 'ధరణి' ఆసుపత్రికి తరలించారు. గుండె వేగం పెరిగిందని, వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున బాలుడు మృతి చెందాడు. దీనికి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువుల ఆందోళనకు యత్నించారు. ఎలాంటి అవాంఛనీ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ఎంజేపీ గురుకుల పాఠశాల ఘటనపై విచారణ

- వారంలోగా విద్యార్థుల సమస్యలు పరిష్కారం



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తిరుపతి

జనగామ రూరల్: జనగామ ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థుల ఘటనపై శనివారం అధికారులు విచారణ చేపట్టారు. ఎంజేపీ గురుకుల జాయింట్ డైరెక్టర్ డి తిరుపతి, ప్రాంతీయ సమన్వయ అధికారి మనోహర్ రెడ్డి, జిల్లా సమన్వయ అధికారి అనిత.. పెంబర్తి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశ పరిచి విచారణ చేపట్టారు. జనగామ ఎంజేపీ బాలుర పాఠశాలలో 8,9 వతరగతి చదువుతున్న విద్యార్థులను పెంబర్తిలోని ఎంజేపీ పాఠశాలకు మార్చారు. అయితే అక్కడ వాతావరణ పరిస్థితులకు ఇమడ లేక కొంత మంది విద్యార్థులు పాఠశాల నుంచి పరారై జనగామ పాఠశాలకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఈ ఘటనపై తల్లిదండ్రులను సమావేశ పరిచి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల సిబ్బందిపై చేసిన ఆరోపణలు సరికాదని, ఇందులో ఎలాంటి వాస్తవాలు లేవని, ర్యాగింగ్ జరగలేదని తెలిపారు. పాఠశాల.. ఇంటికి దూరం అవుతుందని, అసౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు తెలిపారన్నారు. విద్యార్థుల ఇబ్బందులు, సౌకర్యాలపై వారం రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. దీంతో తమ పిల్లలను పెంబర్తి పాఠశాలలోనే చదివిస్తామని తల్లిదండ్రులు అంగీకారం తెలిపినట్లు అధికారులు తెలిపారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక..

- కేజీబీవీ నుంచి ఇద్దరు విద్యార్థినుల పరారీ
- అర్ధరాత్రి కాలినడకన వెళ్తూ ఆగాపేటలో వ్యక్తికి కనిపించిన బాలికలు



విద్యార్థినులను తీసుకెళ్తున్న ఎస్ఓ రజిత

నర్మెట: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉండడం ఇష్టంలేని ఇద్దరు విద్యార్థినులు శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్ నుంచి పరారయ్యారు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన అల్లాడి సుజాత కూతురు హరిణ్య, జనగామ పట్టణానికి చెందిన నరేంద్రాచారి, శిరీష దంపతుల కూతురు బింధుప్రియ మండలంలోని మాన్‌సింగ్ తండా కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. అయితే హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక తమ సామానుతో తప్పించుకుని స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కాలినడకన (మూడున్నర కిలోమీటర్లు) ఆగాపేట గ్రామానికి రాత్రి 1 గంటల ప్రాంతంలో చేరుకోగా వారిని గమనించిన గ్రామస్తుడు కల్యాణం వెంకటయ్య వివరాలు అడిగాడు. 'మాకు హాస్టల్లో ఉండడం ఇష్టంలేదు.. పగలు వెళ్తామంటే వీలుకాలేదు. అందుకే రాత్రి బయలుదేరాం. మా ఇంటికి వెళ్తున్నాం' అని తెలిపారు. దీంతో వారికి సర్దిచెప్పిన ఆయన.. తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చి ఉదయం కేజీబీవీ అధికారులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఎస్ఓ బైరోజు రజిత, సిబ్బంది, తల్లిదండ్రులు.. వెంకటయ్య ఇంటికి చేరుకుని విద్యార్థినులను విద్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం వారిని తల్లిదండ్రులు తమ తమ ఇళ్లకు తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా, రెండు వందల మంది విద్యార్థినులు ఉన్న విద్యాలయంలో పదిమంది బోధన, మరో పదిమంది బోధనేతర సిబ్బంది ఉండగా రోజు రాత్రివేళ ముగ్గురు సిబ్బంది విద్యార్థినులకు తోడుగా ఉంటారు. ఈ క్రమంలో ఈ ఏడాదే కేజీబీవీలో చేరిన వారు అర్ధరాత్రి తప్పించుకుని వెళ్లడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

పారిపోతున్న విద్యార్థిని పట్టుకునేందుకు పరుగెత్తి..

- ప్రాణం వదిలిన సెక్యూరిటీ గార్డు
- గుండెపోటుతో మృతి
- వెంకటాపురంలో ఘటన



సంతోష్ (ఫైల్)

వెంకటాపురం(ఎం): హాస్టల్ నుంచి పారిపోతున్న విద్యార్థినిని పట్టుకునేందుకు పరుగెత్తగా గుండెపోటుకు గురై ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని మైనార్టీ మహిళా జూనియర్ కళాశాలలో జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వందన కథనం ప్రకారం.. మైనార్టీ కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు పేరేంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు తన తల్లిదండ్రులు లేదనే నెంపతో ఏటూరునాగారానికి చెందిన ఓ మైనార్టీ విద్యార్థిని సాయంత్రం 5 గంటల సమయంలో కళాశాల నుంచి పారిపోతోంది. దీంతో సెక్యూరిటీ గార్డు గాదం సంతోష్ (49).. పరుగెత్తి విద్యార్థినిని పట్టుకుని కళాశాలకు తీసుకొస్తున్న క్రమంలో ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పి కుప్పకూలిపోయాడు. వెంటనే కళాశాల సిబ్బంది, అధ్యాపక బృందం 108లో ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సంతోష్ గుండెపోటుతో మృతిచెందినట్లు వెల్లడించారు. మృతుడు సంతోష్ ములుగు వాసి కాగా 2021 నుంచి మైనార్టీ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉంది.

బైక్ దొంగల అరెస్ట్

డోర్నకల్: ఇద్దరు బైక్ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.ఉపేందర్‌రావు వివరాలు వెల్లడించారు. ఈ నెల 4న డోర్నకల్ మెయిన్‌రోడ్డులో తన టీవీఎల్ ఎక్స్ఎల్ వాహనం చోరీకి గురైందంటూ ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బద్దెల వీరబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఎస్సై తిరుపతి పట్టణ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్యాస్ గోడౌన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా మోపెడ్ వాహనాలను చోరీ చేస్తున్న దొంగలుగా తేలింది. వీరిని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామానికి చెందిన ధారావత్ శ్రీను, కొప్పుల నాగరాజుగా గుర్తించారు. అనంతరం వీరి వద్ద మూడు టీవీఎస్ మోపెడ్ వాహనాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.